క్లుప్తంగా

తహసీల్దార్ అమ్మాజీ బదిలీ

రంగంపేట: స్థానిక తహసీల్దార్ వాకాడ అమ్మాజీ బదిలీ అయ్యారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ నేదూరి దొరకయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన అమ్మాజీ రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దొరకయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

96 మంది ఉత్తీర్ణత

రంగంపేట: ఇటీవల జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 96 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొత్తం 148 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 41 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 113 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా వారిలో 55 మంది మొత్తం 96 మంది ఉత్తీర్ణలయ్యారని తెలిపారు.

బంగారుకొండకు వితరణ



సీడీపీఓకు సొమ్ము అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పెద వెంకన్న

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న బంగారుకొండ పథకానికి మండల జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న తన నెల జీతం రూ. ఆరు వేలను వితరణగా అందజేశారు. తన స్వగ్రామమైన రాధేయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బలహీనంగా ఉన్న ఇద్దరు చిన్నారులకు వినియోగించే విధంగా ఖర్చు చేయాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీ టి.నాగమణిని కోరారు.

ఇంటర్ విద్యకు ప్రోత్సాహం

రాజానగరం: దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా 10వ తరగతిలో ఉత్తీర్ణులైన పేద బాలికలకు ఇంటర్మీడియట్ విద్యను పొందేందుకు గాను ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. 10వ తరగతిలో 70 శాతం మార్కులు పొంది, ఏడాదికి రూ.2 లక్షలు ఆదాయం దాటని, తల్లిదండ్రులలో ఒక్కరే ఉన్న బాలికల కోసమే 'పద్మశ్రీ బాలికా విద్యాఉపకార వేతనం 'పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు 97035 58383 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

శంకుస్థాపనలు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో పలు వివిధ అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద బుధవారం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. గ్రామంలోని కల్యాణ మండపం ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు వ్యయంతో నిర్మించే వేంకటేశ్వరుని ఆలయానికి, రైస్ మిల్లు లేఅవుట్‌లో రూ.10 లక్షలతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ పనులకు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. వాడ్రేవు శ్రీనివాస్, భూషం శెట్టి అన్నారం, తాతబ్బాయి, ఎస్.రామారావు, నాగవరపు త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురం ఎస్సీపేటలోని లూథరన్ చర్చి వెనుక తాటాకిల్లు బుధవారం దగ్ధమైంది. కొలిపే సురేష్‌కు చెందిన ఈ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఆటో నడుపుకునే సురేష్ బయటకు వెళ్లగా భార్య పాపమ్మ వంట పని ముగించుకుని పడుకొన్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఆటో రికార్డులు, మంచాలు, వంట సామగ్రి, టీవీ, ఫ్యాన్లు, దుస్తులతో పాటు సురేష్ కుమారుడు పనిచేస్తున్న రైతు వద్ద అవసరం నిమిత్తం తెచ్చిన రూ.30 వేలు కాలిపోయాయి. ఆస్తినష్టం సుమారు రూ.4 లక్షలు ఉండవచ్చని అంచనా.

ఇరువర్గాల ఘర్షణ

సీతానగరం: లంకూరు రామాలయం వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వ్యక్తిని మందలించినందుకు ఇరువర్గాల మధ్యం రేగింది. బుధవారం రాత్రి 9.15 గంటలకు లంకూరు దక్షిణ వైపు రామాలయం వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటున్న వ్యక్తిని మందలించినందుకు ఇరుసామాజిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. సమాచారం అందుకున్న ఏఎస్సై సమర్పణరావు తన సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించారు. రాత్రి 10 గంటలైనా వివాదం సద్దుమణగలేదు.

ముగ్గురికి గాయాలు

గోకవరం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎ.జయానంద్, వై.మహేష్ ప్రయాణిస్తున్న బైక్, కామరాజుపేటకు చెందిన ఎం.వాసు ప్రయాణిస్తున్న బైక్ బుధవారం కొత్తపల్లి శివారున ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానికులు గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా సాగుతూ..

- ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు

సీతానగరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. మోటార్ల వద్ద వరి ఆకుమడులు వేస్తున్నారు. మరో నెల రోజుల్లో నాట్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. సాధారణంగా నాట్లు వేయడానికి నారుపోసి 30 రోజుల వయసున్న నారును నాటడం మామూలుగా చేసే పద్ధతి. అయితే నారుమడి కట్టడానికి సరిపడా నీరు ఉండాలి. కాబట్టి ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరత, అధిక కూలి రేట్లు, రైతు ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెదజల్లే పద్ధతి, డ్రమ్ము సీడర్ ద్వారా విత్తుకునే ప్రత్యామ్నాయం వైపు రైతులు చూస్తున్నారు. సీతానగరం మండలంలో 14 వేలు, కోరుకొండ మండలంలో 15 వేలు, రాజానగరం మండలంలో 12 వేల ఎకరాలలో వరి సాగు అవుతుంది. ఎక్కువ శాతం వరి ఆకుమడులు వేసి, వరినాట్లు వేసే పద్ధతినే రైతులు కొనసాగిస్తున్నారు

వరి విత్తనం వెదజల్లు పద్ధతి

వర్షాలు పడుతున్నప్పుడు భూమిని బాగా గుల్లగా దున్నుకోవాలి. పొలాన్ని 15 రోజుల ముందుగా దమ్ము చేసి తర్వాత విత్తడానికి 4, 5 రోజుల ముందు మరోసారి దమ్ము చేసి ఎత్తు పల్లాలు లేకుండా నేలను చదును చేసి, మురుగునీరు పోయేటట్లు కాలువలు ఏర్పాట్లు చేయాలి. ఆయా ప్రాంతాలకు అనువైన వరి రకాలను ఎంటీయూ-1061, ఎంటీయూ-1064, ఎంటీయూ-1075, విజేత, సాంబా మసూరి, పీఎల్-1100 వంటి పలు రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. ఎకరానికి 10, 15 కిలోలు సాంప్రదాయ పద్ధతిలో నారుమడులు పెంచే సమయంలోనే వరి విత్తనాలను నేరుగా చల్లుకోవచ్చు.

డ్రమ్ము సీడరు ద్వారా..

కొద్దిగా కోర వచ్చి మొలకెత్తించిన వరి విత్తనాలను డ్రమ్ము సీడర్ డబ్బాలలో పోసి దమ్ము చేసి చదునుగా ఉన్న మడిలో పెట్టి ముందుకు లాగాలి.



డ్రమ్ము సీడరు ద్వారా విత్తనాలు విత్తుతున్న రైతులు

ఎకరానికి 10 నుంచి 12 కిలోలు విత్తనం సరిపోతుంది. ఇద్దరు వ్యక్తులు డ్రమ్ము సీడర్ ద్వారా మూడు గంటలలో ఎకరం పొలంలో విత్తనాలను విత్తవచ్చు.

ఎరువులు

నాట్లు వేసి సాగు చేసే వరికి సిఫారసు చేసిన ఎరువులనే వెదజల్లే పద్ధతిలోనూ వేసుకోవాలి. తొలకరిలో 36 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 24 కిలోల పోటాష్ వేయాలి. ఆఖరి దమ్ములో పూర్తి భాస్వరం, సగం పొటాష్ వేయాలి. మిగిలిన పొటాష్‌ను అంకురం దశలో వేయాలి. నత్రజనిని మూడు సమబాగాలుగా విత్తేటప్పుడు, పిలక దశలో, అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. అవసరాన్ని బట్టి జింకు సల్ఫేట్‌ను దమ్ములో ఎకరానికి 20 కిలోలు వేయాలి.



డ్రమ్ము సీడరు విధానంలో మొలకెత్తిన వరి

ఒకేలా దిగుబడి

డ్రమ్ము సీడర్, వెదజల్లు పద్ధతి ద్వారా వరిసాగు చేయవచ్చు. వరి ఆకుమడులు వేసి, నాట్లు వేసే పద్ధతినే రైతులు ఎక్కువ అవలంబిస్తున్నారు. నాటే పద్ధతి కన్నా, వెదజల్లు, డ్రమ్ముసీడర్‌తో ఖర్చు తక్కువ అవుతుంది. తెగుళ్లు తక్కువ శాతం సోకే అవకాశం ఉంటుంది. మూడు విధానాల్లోనూ దిగుబడి ఒకేలా వస్తుంది.

– కె. సూర్య రమేష్, మండల వ్యవసాయశాఖాధికారి



నేడు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం

అనపర్తి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో పురస్కారాలు అందించి సత్కరించే కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.స్వామి నాయక్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమం స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. పదో తరగతిలో 589 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన బిక్కవోలు మండలం పందలపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎండీవీ గణేష్‌కుమార్, 588 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన పెదపూడి మండలం కుమారప్రియం జెడ్పీ పాఠశాల విద్యార్థి ఆర్‌హెచ్ఎస్ వీరబాబు, 583 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎఎస్ఎస్‌వీఏ శ్రీకర్‌లకు ఎమ్మెల్యే చేతుల మీదగా పురస్కారాలు, నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియెట్‌లోని వివిధ గ్రూపుల్లో ప్రతిభ కనబరిచిన అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలకు చెందిన జె.ప్రశాంత్‌బాబు, ఎన్.జశ్వంత్ వినయ్, మండలంలోని లక్ష్మీనరసాపురంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థి జె.శ్రీవిరంచి, నియోజకవర్గంలోని రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కె.శ్రీనులకు పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని వాకింగ్ ట్రాక్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. బుధవారం గ్రామంలో చెరువు వద్ద రుడా నిధులు నుంచి రూ.1.50 కోట్లతో ఈ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతోగాను కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలోని రుడ్మా చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగలపద్మావతి, సర్పంచి బుంగా రామారావు, మండల వ్యవసాయశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో సీఎస్‌బీ ప్రారంభం



బిక్కవోలు సీఎస్‌బీ ప్రారంభించిన సుబ్బారెడ్డి

బిక్కవోలు: గ్రామంలో మెయిన్ రోడ్డు వద్ద నూతన సీఎస్‌బీ (కెథలిక్ సిరియన్ బ్యాంకు)ను బుధవారం ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. బిక్కవోలు తొలిసారిగా ప్రైవేటు బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే అనపర్తి, రాయవరం గ్రామాల్లో ఈ బ్యాంకు సేవలు అందిస్తున్నామని బ్రాంచి మేనేజర్ డి.నాగబాబు, తెలిపారు. ప్రజకు మరింత సేవల అందించాలని ఉద్దేశంతో బిక్కవోలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌గా సాయికృష్ణ , బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజీవ్, ఎస్సై పి.బుజ్జిబాబు, ఉపసర్పంచి డాక్టర్ జంగా మురళీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



కోటికేశవరం హైస్కూల్లో జేవీకే కిట్లు అందజేస్తున్న నాయకులు



విద్యాకానుక కిట్లను అందజేస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరం హైస్కూల్లో బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజునే యూనిఫాం, షూస్, బ్యాగ్, పుస్తకాలు అందజేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు జగనన్న చేస్తున్న మంచిని చూసి, మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామంలోని మూడు ప్రాథమిక, ఒక హైస్కూల్‌లో చదువుతున్న 400 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు.

రామాలయానికి శంకుస్థాపన

గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న రామాలయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడే సింధూదివ్య, స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, ఎంపీటీసీ నేతల బుజ్జి, స్కూల్ చైర్మన్లు గుడాల పెద్ద చిన్నయ్య, తడాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు దోమాదుల రమణ, జల్లూరి పైడియ్య, దేగల గొలుగులియ్య, పట్నాల చిన్నబ్బులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు అనేక పథకాలు

రాజానగరం: రాష్ట్రంలో విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ, విద్యార్థుల భవిత కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని పల్లకడియం పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. అదేవిధంగా రాజానగరం, నరేంద్రపురం, కలవచర్ల, కానవరాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాల పేరెంట్స్ కమిటీలతో కలిసి జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న జేవీకే కిట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రామన్నదొర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, ప్రగడ చక్రి, రాజ్‌కుమార్, బత్తిన వెంకట్రావు పాల్గొన్నారు.

రూ.1.91 లక్షల అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం: అట్టపెట్టెలో దాచిన రూ.1.91 లక్షలు మాయమయ్యాయంటూ కాటవరానికి చెందిన మంతెన శివ శంకర్ బుధవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఆ నగదును అట్టపెట్టెలో ఉంచిన పుస్తకాల మధ్యలో ఉంచి, పెట్టెను అటకపై ఉంచాడు. గత నెల 3న ఇల్లు మారాడు. అనంతరం 22న అట్టపెట్టె తెరిచి చూడగా అందులో నగదు కనిపించలేదు. పాత ఇంటి యజమాని, ఆయన కుమారుడు దొంగిలించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. దీనిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు.

గోదావరి నీటి సరఫరాకు అంతరాయం

రాజానగరం: మండలంలోని కొండగుంటూరు, సంపత్‌నగరం, నామవరం, శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, వెలుగుబంద గ్రామాలకు గోదావరి జలాల సరఫరాకు రెండు రోజులపాటు అంతరాయం కలుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సుబ్బారావు తెలిపారు. కడియం మండలం వేమగిరి కొండపై ఉన్న గోదావరి జలాల పంపిణీ పథకం నుంచి సరఫరా అయ్యే ఈ పథకంలో శ్రీకృష్ణపట్నం, నామవరం వద్ద ఉన్న పైపులైన్ రిపేరు జరుగుతోందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

- ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

అనపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి గిరడా గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ భావి తరాలకు మంచి భవిష్యత్తును అందించే లక్ష్యంతో సీఎం జగన్ విద్యార్థుల అభ్యున్నతికి పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథుల చేతుల మీదగా విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, పార్టీ నాయకులు చందు, నల్లమిల్లి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచి గిరడా గంగాభవాని



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్న హెచ్ఎం రమణబాబు.

చంద్రేడులో...

రంగంపేట: చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లను గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి రామదేవుడు, కంటిపూడి గంగరాజు, మద్దిపూడి వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి



ఫౌంటైన్ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి
- ఎమ్మెల్యేతో కలిసి అనపర్తిలో వాటర్ ఫౌంటైన్ ప్రారంభం

అనపర్తి: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్టు రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డులో స్థానిక దేవీచౌక్ సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద రుడా నిధులు రూ.15.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి షర్మిళారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుడా పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటించడం, లైటింగ్ ఏర్పాటు, వివిధ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ముందుగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి రుడా చైర్ పర్సన్ షర్మిళారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, రుడా వైస్ చైర్ పర్సన్ బి.బాలస్వామి, కార్యదర్శి శైలజవల్లి, ఈఈ టి.చంద్రశేఖరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు పాదూరి డేవిడ్‌రాజు, పడాల వెంకటరెడ్డి, పడాల కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా వ్యవసాయశాఖ సహకారంతో తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) సమావేశ మందిరంలో బుధవారం రైతుసంక్షేమ పథకాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల కోసం అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, అవి పొందేందుకు కావాల్సిన అర్హతలను వివరించారు. అర్హత ఉండి, పథకాలు అందకపోతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఉచిత న్యాయ సలహాలు, న్యాయసేవలు కూడా పొందవచ్చన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌పీ ఏడీఏ రామలక్ష్మి, తొర్రేడు సొసైటీ సభ్యుడు దండమూడి అర్జునరావు, రైతులు, సొసైటీ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బాల కార్మిక నిర్మూలన కోసం జరుగుతున్న నెలరోజుల శిబిరంలో భాగంగా సంబంధిత అధికారులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అభినందిస్తున్న పార్టీ నాయకులు

సీతానగరం: జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శిగా సీతానగరం మండలం సింగవరానికి చెందిన అంబటి రమణ పేరును మండల నాయకులతో చర్చించి ప్రతిపాదించామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మండల నాయకులతో సమావేశమయ్యారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచీ అంబటి రమణ వైఎస్సార్ సీపీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారన్నారు. సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ నాయకులు సత్తిపండు రాజు, చల్లమళ్ల సుజీరాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు, దేశబత్తుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరు

- అనపర్తిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఎంపీ మార్గాని భరత్‌రామ్



ఆర్‌యూబీ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

అనపర్తి: రైల్వే స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకానికి ఎంపికైన అనపర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి 3.50 కోట్లు మంజూరైనట్టు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన రైల్వే ఉన్నతాధికారుల బృందం, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి ఎంపీ భరత్‌రామ్ బుధవారం అనపర్తి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి మంజూరైన నిధులతో ప్రాథమిక, మౌలిక సదుపాయాలతో స్టేషన్ అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా గతంలో మూసివేసిన ఉత్తర క్యాబిన్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని రైల్వే ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే గతిశక్తి డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఐ.రవీంద్ర, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, ఈడీఎంఏసీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఆర్కిటెక్ట్ ఫైజా అహ్మద్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, రంగంపేట మండల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, మిలట్రీరెడ్డి, విజయకుమారి, ఆర్‌అండ్‌బీఅధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాకు అభినందనలు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సన్మానిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతానగరం: సీతానగరం, కోరుకొండ మండలాల్లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సన్మానించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఉద్యోగస్తులు ప్రభుత్వంలో ఒక భాగమని, వారి కళ్లల్లో సంతోషం చూడాలనేదే ముఖ్యమంత్రి జగన్ కోరికన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు పాల్గొన్నారు.